క్లుప్తంగా

నగరంలో 93.78 శాతం పింఛన్‌ల పంపిణీ



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరంలో వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీ శనివారం రెండో రోజు కొనసాగింది. 93.78 శాతం మేర పింఛన్‌ల పంపిణీ పూర్తి చేశారు. నగరంలో 19,194 పింఛన్లు ఉండగా 18 వేల పింఛన్‌లను పంపిణీ చేశారు. ఇంకా 1194 పింఛన్లను పంపిణీ చేయాల్సి ఉంది. పింఛన్‌దారులకు వలంటీర్లు పింఛన్లను పంపిణీ చేశారు. నగరంలోని 8వ డివిజన్ ఎల్‌ఐసీ కాలనీలో నివసించే ఉలవలమ్మ రోడ్డు ప్రమాదానికి గురై చింతచెట్టు ప్రాంతంలోని కుమారుని ఇంటి వద్ద ఉంటోంది. దీంతో వలంటీర్ కళ్యాణి, ఆ డివిజన్ కార్పొరేటర్ శ్రీరాం చిన్నా ఆమె వద్దకు వెళ్లి పింఛన్ అందజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మోపిదేవి: మోపిదేవిలో యానాదుల కాలనీకి చెందిన తుమ్మా ఓర్పమ్మ(45) కిడ్నీ సంబంధిత వ్యాధితో శనివారం మృతి చెందింది. దహన సంస్కారాలు చేయడానికి ఇబ్బంది పడుతున్నట్లు స్థానికుల నుంచి తెలుసుకున్న శ్రీ రామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్‌కిషోర్ నాయుడు రూ.5 వేలు మృతురాలి కుమారుడు అంకాలుకు అందజేశారు. పాస్టర్ విలియం కేరి, యానాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, తోట నరసింహ నాయుడు, పాస్టర్ ఏసురత్నం, స్థానికులు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ డైరీ ఆవిష్కరణ



పెడన: టౌన్ ప్లానింగ్ డైరీ – 2024ను పెడన పురపాలక సంఘ టీపీవో వి.ఏసుబాబు శనివారం ఆవిష్కరించారు. పురపాలక సంఘ కార్యాలయంలో జరిగిన ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో పట్టణంలోని వార్డు సచివాలయాలకు చెందిన ప్లానింగ్ కార్యదర్శులు జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రామాయణం టాలెంట్ టెస్ట్ విజేత కొమ్మారెడ్డి విద్యార్థిని



బంటుమిల్లి: రాజమండ్రి ఎడ్యుకేషన్ స్పెషల్ వారు 2023 డిసెంబరు 23న నిర్వహించిన గోదావరి రామాయణం టాలెంట్ టెస్ట్ పోటీలో స్థానిక కొమ్మారెడ్డి ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థిని సీహెచ్ సుమశ్రీ రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించినట్లు పాఠశాల హెడ్‌మాస్టరు ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఫలితాలు ఈ నెల ఒకటవ తేదీన ప్రకటించినట్లు ఆయన చెప్పారు. విజేతను పాఠశాల డైరెక్టరు కె.కిషోర్, ఉపాధ్యాయులు అభినందించారు.

శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

తోట్లవల్లూరు: ఈ నెల 8న జరగనున్న శివరాత్రి ఉత్సవాల విజయవంతానికి అధికారులు సమష్టిగా పనిచేయాలని తహసీల్దార్ ఎం.కుసుమకుమారి సూచించారు. స్థానిక శ్రీభ్రమరాంబ చెన్నమల్లికార్జునస్వామి ఆలయంలో శివరాత్రి ఏర్పాట్లపై శనివారం సమీక్ష సమావేశం జరిగింది. పుణ్యస్నానాల కోసం వచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కుసుమకుమారి ఆదేశించారు. ఎస్‌ఐ పి.విశ్వనాథ్, సెబ్ ఎస్‌ఐ దుర్గాప్రసాద్, ఆలయ ఈఓ హరి దుర్గా నాగేశ్వరరావు, గుమ్మస్తా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

20 నుంచి కూచిపూడి నృత్యనీరాజనం



విజయవాడకల్చరల్: కూచిపూడి గ్రామ అధిష్టాన దేవత బాలా త్రిపుర సుందరి రామలింగేశ్వరస్వామి 261 వార్షిక కల్యాణ మహోత్సవం సందర్భంగా కూచిపూడి గ్రామంలో ఈ నెల 20వ తేదీ నుంచి వారం రోజుల పాటు అంతర్జాతీయ కూచిపూడి నృత్యోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహక సంఘం అధ్యక్షుడు డాక్టర్ వేదాంతం రాధేశ్యాం తెలిపారు. గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహించిన సమావేశంలో శనివారం ఆయన వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో కూచిపూడి, భరతనాట్యం, కథక్, కథకళి లాంటి భారతీయ నృత్య సంప్రదాయ కార్యక్రమాలను కళాకారులు ప్రదర్శించాలని తెలిపారు. ముందుగా పేర్లు వారు ప్రదర్శించే అంశాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమలతో పాటు దేవాలయంలో నిత్యపూజలు, హోమాలు జరుగుతాయని తెలిపారు. సమావేశంలో నాట్యాచార్యులు సప్తా శివకుమార్, విజయశేఖర్ పాల్గొన్నారు. వివరాలకు 98491 38166 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రెండు చుక్కలతో జీవితానికి రక్షణ



నాగాయలంక మెయిన్ రోడ్డులో పల్స్‌పోలియో ర్యాలీలో డాక్టర్లు శివరామకృష్ణ, ఇంద్రకుమార్ రెడ్డి తదితరులు

నాగాయలంక: మండలంలో ఆదివారం జరిగే పల్స్‌పోలియో విధివిధానాలపై మండల పరిధిలోని నాగాయలంక, ఎదురుమొండి, సొర్లగొంది ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ఆధ్వర్యంలో శనివారం వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలకు అవగాహన సమావేశాలు, ర్యాలీలు జరిపారు. స్థానిక మండల హెడ్‌క్వార్టర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బందికి వైద్యాధికారి డాక్టర్ వి.శివరామకృష్ణ, డాక్టర్ ఎం.ఇంద్రకుమార్ రెడ్డి నేతృత్వంలో అవగాహన సమావేశం జరిపారు. అనంతరం నాగాయలంక ప్రధానవీధుల్లో పల్స్ పోలియో ర్యాలీ జరిపారు. ప్రతి ఒక్కరూ ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియోడ్రాప్స్ వేయించాలని పిలుపునిచ్చారు. ఐదేళ్ల లోపు నాగాయలంక పీహెచ్‌సి పరిధిలో 2885 మంది పిల్లలు, సొర్లగొంది పరిధిలో 1228 మంది, ఎదురుమొండి పీహెచ్‌సి కింద 1165 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు లక్ష్యంగా ఉన్నారని వైద్య అధికారులు తెలిపారు. మూడింటి పరిధిలో మొత్తం 53 పల్స్ పోలియో బూత్‌లు ఏర్పాటు చేశారు. గ్రామాల వీధుల్లో పల్స్‌పోలియోపై ప్రజల్లో చైతన్యం కోసం మైకు ప్రచారం నిర్వహించారు. డాక్టర్ కె.శ్యామ్‌ప్రసాద్(సొర్లగొంది), డాక్టర్ ఫాతిమున్నీసా(ఎదురుమొండి) పీహెచ్‌ఎన్ లీల, అర్జా సుబ్రమణ్యం, సీహెచ్‌ఓ శివయ్య ఆశ కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పల్స్ పోలియో లక్ష్యం నూరు శాతం సాధించాలి

మోపిదేవి: పల్స్ పోలియో లక్ష్యం నూరుశాతం సాధించాలని ఎంపీడీఓ కె. శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సాయంత్రం పల్స్ పోలియో టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ మార్చి 3వ తేదీ ఆదివారం 5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ విధిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఎంఈఓలు రాజ్‌కుమార్, సాగర్, వైద్యాధికారులు డాక్టర్ శ్రీరామ్‌సాయి, డాక్టర్ అనిల్‌కుమార్, ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో శేషుకుమారి, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

పల్స్ పోలియో చుక్కలు వేయించండి

మోపిదేవి: అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించాలని ఎండీడీఓ కె. శ్రీనివాసరావు సూచించారు. ఆదివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మోపిదేవి శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థాన సన్నిధిలో కూడా పల్స్‌పోలియో చుక్కల మందు వేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీఓ కోరారు.

పల్స్ పోలియోకు ఏర్పాట్లు పూర్తి

గూడూరు: ఆదివారం పల్స్ పోలియోకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 2914 మంది ఐదేళ్లలోపు వయస్సు కలిగిన చిన్నారులు ఉన్నారు. వారికి పోలియో చుక్కలు వేయడానికి గూడూరు మండలంలో 35 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయగా, ఒక మొబైల్ టీంను ఏర్పాటు చేశారు.

నయనానందకరంగా సీతారామ కల్యాణం



రామాలయం ప్రాంగణంలో జరిగిన రాముడి కల్యాణంలో పీటలపై కూర్చున్న జంటలు

పెదకమ్మవారిపాలెం(నాగాయలంక): గ్రామంలో స్థానిక భక్త సమాజం, రేపల్లెకు చెందిన శ్రీగాయత్రీ సేవా ట్రస్ట్ (నల్లూరు) ఆధ్వర్యంలో స్థానిక రామాలయంలో గత మూడు రోజులుగా జరుగుతున్న శ్రీరామ వైభవోత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా లోక కల్యాణార్థం ట్రస్ట్ నిర్వాహకుడు, వేద పండితుడు పూజ్య గురూజీ ఆరేమండ చక్రవర్తి బ్రహ్మత్వంలో శ్రీ సీతారాముల కల్యాణం నయనానందకరంగా నిర్వహించారు. పీటలపై తలశిల పాపారావు–లక్ష్మి, దేవనబోయిన శివ వెంకట వరప్రసాద్–శ్రీరామమ్మ దంపతులు కూర్చున్నారు. కల్యాణం తదుపరి మహిళలు సీతారాములకు పుష్పయాగం జరిపారు. నాగాయలంకకు చెందిన సంకర్షణ భజన మండలి సభ్యులు నిర్వహించిన భజన, శ్రీరాముని కల్యాణ గీతాలు, భక్తి గీతాలాపన అలరించింది. గ్రామ సర్పంచ్ తలశిల అర్జునరావు, ఉత్సవ నిర్వాహక కమిటీ ప్రతినిధులు సబ్బినేని పద్మజ, తలశిల నాగలక్ష్మి పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కల్యాణానంతరం భక్తులకు అన్నసంతర్పణ జరిపారు.

5 నుంచి శ్రీదుర్గా నాగేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు

- ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్న కృష్ణానది
- పిండ ప్రదానానికి దక్షిణకాశీగా పెదకళ్లేపల్లి ప్రసిద్ధి
- శివుని దర్శనార్థం లక్షల్లో భక్తుల రాక



పెదకళ్లేపల్లిలో వెలిసిన శ్రీ నాగేశ్వరస్వామివారు



గాలిగోపురం వద్ద శివుని విగ్రహం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): దక్షిణకాశీగా పేరుగాంచిన పెదకళ్లేపల్లిలో ఉన్న శ్రీ దుర్గా, పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈనెల 5వ తేదీ నుంచి 13వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పెదకళ్లేపల్లి–కదళీపుర క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి లక్షల్లో భక్తులు తరలిరానున్నారు. ప్రతి ఏటా ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర సుదూర ప్రాంతాల నుంచి కూడా పెదకళ్లేపల్లికి తరలి వచ్చి ఉత్తర దిక్కుగా ప్రవహిస్తున్న కృష్ణా నదిలో స్నానమాచరించి శ్రీ దుర్గా, పార్వతీ సమేత నాగేశ్వరస్వామి వారిని దర్శించుకుంటారు. దేవదాయ శాఖ అధికారులతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు తమ శక్తిమేరకు భక్తులకు సాయం అందిస్తూ ఉత్సవాలను జయప్రదం చేయడం ఆనవాయితీగా వస్తుంది. క్రీ.శ.1292లో ఈ ఆలయం సోమశివాచార్యులు నిర్మించారని తెలుస్తోంది. 1782లో చల్లపల్లి ప్రభువులైన శ్రీ రాజా యార్లగడ్డ కోదండరామన్న ప్రాకారాదులు నిర్మించారు. అప్పటి నుంచి రాజా వంశీకులే అనువంశిక ధర్మకర్తలుగా కొనసాగుతున్నారు. ప్రతి ఏడాది మహాశివరాత్రికి శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాలు వారం రోజుల పాటు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహిస్తారు. కృష్ణానది ఉత్తర దిక్కుగా ప్రవహిస్తున్న ఈ ప్రాంతంలో పుణ్యస్నానాలు ఆచరించి తమ పితృదేవతలకు పిండప్రదానం చేస్తే పునఃజన్మ ఉండదని పెద్దలు చెబుతుంటారు. నదిపోటు సమయంలో కూడా పుణ్యస్నానాలకు ఆటంకం ఏర్పడకుండా నది ఒడ్డున జల్లు స్నానం చేసేందుకు పైప్ లైన్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ పైప్ లైన్ సరిగా పనిచేయడం లేదు. అధికారులు స్పందించి జల్లు స్నానాలకు అవకాశం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆలయం ఎదుట ప్రతిష్ఠించిన మహాశివుని విగ్రహం భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది.

మంచి జరగాలంటే జగన్‌ను మళ్లీ గెలిపించాలి

పెడన వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఉప్పాల రాము

కృత్తివెన్ను: పేద ప్రజల ఆర్థికాభివృద్ధి జరగాలంటే మళ్లీ మన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఎన్నుకోవాలని పెడన నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఉప్పాల రాము అన్నారు. శనివారం ఆయన కృత్తివెన్ను మండలంలోని చినపాండ్రాక పంచాయతీలో జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారికతో కలసి ప్రజాదీవెన కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనిలో భాగంగా వారిరువురు ప్రతి గృహాన్ని సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. భవిష్యత్తులో జగనన్న మళ్లీ ముఖ్యమంత్రిగా ఎందుకురావాలో వారికి వివరించారు. ఇప్పుడు అమలవుతున్న సంక్షేమాన్ని మించి భవిష్యత్తులో జగనన్న మరింత సంక్షేమాన్ని అందిస్తారని తెలిపారు. మీరంతా జగనన్నను ఆశీర్వదించాలని, ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనతో పాటు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గెలిపించాలని రాము ప్రజలను కోరారు.

స్వచ్ఛమైన తాగునీరందిస్తాం...

తమకు తాగునీటి సమస్య ఉందని పలువురు గ్రామస్తులు రాముకు వివరించగా, వెంటనే స్పందించిన రాము మల్లేశ్వరం స్కీము చెరువు, ఫిల్టర్లను మరమ్మతు చేశామని, మరో రెండు మూడు రోజుల్లో స్వచ్ఛమైన తాగునీటిని కుళాయిల ద్వారా అందించనున్నట్లు వివరించారు. తనకు అండగా ఉండాలని రాము, హారిక ప్రజలను కోరారు. వారికి గ్రామంలో అపూర్వ ఆదరణ లభించింది. కార్యక్రమంలో ఆర్టీసీ కృష్ణా జోనల్ చైర్మన్ పి.మహేష్, ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు, జేసీఎస్ మండల కన్వీనర్ బాపూజీ, సర్పంచ్ బాయమ్మ, స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మునిపెడ, యండపల్లి, చెరుకుమిల్లి పంచాయతీలలో ప్రజాదీవెన కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఉప్పాల రాము, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.

బంటుమిల్లి బస్టాండు మరమ్మతులకు రూ.29 లక్షలు

ఏపీఎస్‌ఆర్టీసీ కృష్ణా రీజియన్ చైర్మన్ మహేష్



బంటుమిల్లి బస్టాండు ఆవరణను పరిశీలిస్తున్న చైర్మన్ మహేష్, డీపీటీఓ వాణిశ్రీ తదితరులు

బంటుమిల్లి: స్థానిక ఆర్టీసీ బస్టాండు మరమ్మతులకు రూ.29 లక్షలు మంజూరు చేసినట్లు ఏపీఎస్ ఆర్టీసీ కృష్ణా రీజియన్ చైర్మన్ పిన్నింటి మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆర్టీసీ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులతో కలసి బస్టాండును సందర్శించారు. ఇందులో భాగంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ బస్టాండు ఆవరణ అంతా సిమెంటు చేయడం, ప్రహరీ నిర్మాణానికి నిధులు వెచ్చిస్తున్నట్లు మహేష్ తెలిపారు. దీని కోసం ఇంజినీరింగ్ అధికారులు చేపట్టవలసిన పనులను పరిశీలించడానికి వచ్చినట్లు చైర్మన్ తెలిపారు. ఈ నెల 5వ తేదీన రాష్ట్ర చైర్మన్, ఎండీ చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు చైర్మన్ మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా బస్సుల పనివేళల సమస్యలను ప్రయాణికులు చైర్మన్ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో జిల్లా డీపీటీఓ ఎ.వాణిశ్రీ, డీఈఈ జగదీష్, ఏఈఈ సుభాని, సిబ్బంది పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌ను పరామర్శించిన ఎస్పీ

సాక్షి, మచిలీపట్నం: రహదారి ప్రమాదంలో గాయపడిన హెడ్ కానిస్టేబుల్ మాకల నాగేంద్ర ప్రసాద్‌ను కృష్ణా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పరామర్శించారు. బంటుమిల్లి మండలం అత్తమూరు గ్రామానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ మాకల నాగేంద్రప్రసాద్ వీరవల్లి పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. విధులకు హాజరయ్యే నిమిత్తం నాగేంద్ర ప్రసాద్ శనివారం ఉదయం అత్తమూరు నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన ఆయన్ను పెడన వద్ద ఓ లారీ రాంగ్ రూట్‌లో వచ్చి ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యారు. స్థానికులు మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్య చికిత్స కోసం విజయవాడలోని ఓ ప్రైవేటు హాస్పిటల్లో చేర్పించారు. సమాచారం తెలుసుకున్న జిల్లా ఎస్పీ అస్మి శనివారం రాత్రి స్వయంగా ఆసుపత్రికి వెళ్లి, అక్కడ హెడ్ కానిస్టేబుల్ ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు హెడ్ కానిస్టేబుల్ ఆరోగ్య పరిస్థితిని తనకు తెలియజేయాలని, మెరుగైన వైద్యం అందించి తను క్షేమంగా తిరిగి కోలుకునేంత వరకు అక్కడే ఉండి ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

వలంటీర్లకు నియామక పత్రాలు అందజేత

మచిలీపట్నంటౌన్: నగరంలో పది మంది వలంటీర్లను ఆయా సచివాలయాల పరిధిలో నూతనంగా నియమిస్తూ నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ శనివారం నియామక పత్రాలను అందజేశారు. వలంటీర్లుగా నియమితులైన వారు ప్రభుత్వం సూచించిన విధంగా నిబద్ధతతో పనిచేసి ప్రజలకు సేవలు అందించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ శీలం భారతి, కార్పొరేటర్లు ఏకశిరి వెంకటేశ్వరరావు, రాసంశెట్టి వాణిశ్రీ, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీకాకోళపు నరసింహగుప్తా, ధనకొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నియామకపత్రాలు అందజేస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ పరీక్షలు ప్రారంభం

పెడన: సెకండ్ ఇయర్ ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో శనివారం ఉదయం ప్రారంభమయ్యాయి. పెడనలోని శ్రీబొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 193 మంది విద్యార్థులకు గాను 190 మంది హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ ఎంవీఎస్ఎస్ మహేష్‌బాబు, డీవో శాంభవి తెలిపారు. విజయానంద జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 81 మందికి గాను 78 మంది హాజరయ్యారని, ముగ్గురు గైర్హాజరయ్యారని సీఎస్ ఆదివిష్ణు, డీవో ఎండీ మున్వర్ తెలిపారు. ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఆయా కేంద్రాల అధికారులు పేర్కొన్నారు.

బంటుమిల్లి: ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థుల కోసం స్థానికంగా ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాల్లో శనివారం పరీక్షలు ప్రశాంతంగా మొదలైనాయి. ఇందులో భాగంగా జంబ్లింగ్ విధానంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ, వాగ్దేవి జూనియర్ కాలేజీలో ప్రభుత్వం కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజి, సాయి సిద్ధార్థ జూనియర్ కాలేజి, వాగ్దేవి జూనియర్ కాలేజి, కృత్తివెన్ను బాలజ్యోతి జూనియర్ కాలేజీ విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 176 మందికి గాను 174 మంది, వాగ్దేవి కాలేజీ సెంటర్‌లో 123 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. పరీక్షలు సీసీ కెమేరాల పర్యవేక్షణలో జరిగాయి. విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ త్రిపురసుందరీదేవి తెలిపారు.

గీతా మందిరానికి ధ్వజస్తంభం బహూకరణ



అవనిగడ్డ: హైదరాబాద్ గ్రాండ్ ఫార్మాలో సీఐగా పనిచేస్తున్న అవనిగడ్డకు చెందిన సూరగం శ్రీనివాసరావు సూరగం హరిప్రసాద్ జ్ఞాపకార్థం స్థానిక గీతా మందిరానికి ధ్వజస్తంభం బహూకరించారు. నేరెళ్ళపాలెంలోని కోదండ రామాలయం నుంచి మేళతాళాలతో ప్రత్యేక వాహనంపై గీతామందిరం వరకూ దానిని ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి ఆలయ నిర్వాహకులకు అప్పగించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెన్ను రంగారావు, ఎస్.విహార్ అధినేత రాజులపాటి ప్రసాద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సూరగం జగన్‌మోహన్‌రావు, దివిసీమ ప్రఖండ అధ్యక్షుడు కమ్మిలి సుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ నిర్వాహకులు భోగాది రాము పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లింపుదారులకు రాయితీ

మచిలీపట్నంటౌన్: నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను చెల్లింపుదారులకు వడ్డీని మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మార్చి నెలాఖరు వరకు అవకాశం కల్పించిందని కమిషనర్ బాపిరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నును, పాత బకాయిలను ఒకేసారి చెల్లించిన వారికి వడ్డీ మాఫీ చేస్తామన్నారు. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 29న ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వడ్డీ లేకుండా పన్నులను చెల్లించాలని ఆయన కోరారు.

మానవత్వానికి మచ్చు తునక జగనన్న పాలన



మృతుని సోదరునికి చెక్కును అందజేస్తున్న ఉప్పాల రాము, హారిక

కృత్తివెన్ను: తనను నమ్ముకున్న వారికి ఏదో విధంగా మానవతా సాయం చేయడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్నను మించిన వారు లేరనడానికి ఇటువంటి సంఘటనలే సజీవసాక్ష్యం అంటున్నారు యండపల్లి సర్పంచ్ పిన్నెంటి ప్రభుప్రసాద్. విషయం ఆయన మాటల్లోనే.. కృత్తివెన్ను మండలం గాంధీనగరం గ్రామానికి చెందిన జన్యావుల తులసీరావు కొద్ది నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ప్రమాదకారణంగా రావాల్సిన జగనన్న బీమా కోసం వారి బంధువులు అర్జీ పెట్టుకోగా మృతునికి డ్రైవింగ్ లైసెన్సు లేకపోవడంతో బీమా వర్తించలేదు. దీంతో వారు తీవ్ర నిరాశ చెందారు. విషయం తెలుసుకున్న పెడన వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఉప్పాల రాము శుక్రవారం జగనన్న పామర్రు రావడంతో మృతుని సోదరుణ్ణి వెంటపెట్టుకుని వెళ్లారు. విషయం ముఖ్యమంత్రికి వివరించగా వెంటనే ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మృతుని భార్య పేరుమీద రూ.3 లక్షల చెక్కును ఇవ్వాలని ఆదేశించడం, అధికారులు వెంటనే చెక్కును అందించడం జరిగిపోయాయి. మృతుడు పార్టీ కోసం అనుక్షణం పనిచేయడమే కాకుండా పార్టీకి విధేయుడుగా ఉండేవాడని, అటువంటి వ్యక్తికి రాదనుకున్న సాయాన్ని జగనన్న పెద్ద మనస్సుతో చేయడం ఎంతో సంతోషంగా ఉందని మృతుని సోదరుడు జె.వెంకన్న అన్నారు. తమ కష్టాన్ని ముఖ్యమంత్రికి తెలియజేసేలా చేయడంతో పాటు, రూ.3 లక్షలు అందజేయడంలో ఎంతో శ్రద్ధ చూపిన ఉప్పాల రాము, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికలకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం చెక్కును జెడ్పీ చైర్‌పర్సన్ దంపతుల చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు, దేవస్థాన చైర్మన్ నాగేశ్వరరావు, వ్యవసాయ సలహా మండలి జిల్లా బోర్డు సభ్యులు పట్టపు నాని, మైనారిటీ నాయకురాలు షేక్ బేగం తదితరులు ఉన్నారు.

వృద్ధాశ్రమాల్లో అన్నదానాలు

నగరంలో ఘనంగా పేర్ని కిట్టు పుట్టిన రోజు వేడుకలు



కోనేరుసెంటర్‌లో అన్నదానంలో వడ్డన చేస్తున్న డెప్యూటీ మేయర్ శీలం భారతి, చిటికిన నాగేశ్వరరావు

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీ శ్రేణులు, ఆయన అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని జిల్లా కోర్టు సెంటరులో ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ వైఎస్సార్ సీపీ నాయకులు కేక్ కట్ చేశారు. పేర్ని కిట్టు నిండు నూరేళ్ల ప్రజాసేవలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు. కోనేరుసెంటర్‌లో పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మేయర్ వెంకటేశ్వరమ్మతో పాటు డెప్యూటీ మేయర్ శీలం భారతి, మాజీ కౌన్సిలర్ చిటికిన నాగేశ్వరరావు ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు అనిశెట్టి ధనుంజయ ఆధ్వర్యంలో నగరంలోని రాజుపేట ఆనంద వృద్ధాశ్రమంలో, సుకర్లాబాద్‌లోని స్నేహాలయ వృద్ధాశ్రమంలో వృద్ధులకు, మానసిక వికలాంగులకు అన్నదానం చేశారు. నాగపోతరావు సెంటరులోని వైఎస్సార్ విగ్రహం వద్ద 36వ డివిజన్ కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్, పార్టీ నాయకుడు ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పేర్ని కిట్టు పుట్టినరోజు సందర్భంగా అభిమానులు, పార్టీ కార్యకర్తలు నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

పెదపట్నంలో ...

కోనేరుసెంటర్: బందరు మండలం పెదపట్నం గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, యువ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పుట్టినరోజు వేడుకలను గ్రామ సర్పంచ్ గడిదేసి అనూష ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద కేకును కట్ చేసి గ్రామస్తులకు పంచిపెట్టారు. గ్రామంలోని పెద్దలకు, వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ ఇన్‌చార్జి గడిదేసి రాజు, గ్రామ పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ–చలానాలపై ప్రత్యేక డ్రైవ్

కోడూరు: వాహనాలపై ఉన్న ఈ–చలానాలను కట్టించుకునేందుకు కోడూరు పోలీసులు శనివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. స్థానిక ప్రధాన సెంటర్, పోలీస్ స్టేషన్ సమీపంలో ఎస్‌ఐ శిరీష పర్యవేక్షణలో సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. నంబర్ ప్లేట్ ఆధారంగా వాహనంపై ఉన్న ఈ–చలానాలను ఆన్‌లైన్‌లో పరిశీలించి, వాహనచోదకులతో వాటిని కట్టించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, పొల్యూషన్ సర్టిఫికెట్ కాపీలను పరిశీలించారు. సరైన పత్రాలు చూపని వాహనదారులకు చలానాలు వేశారు. వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ సూచించారు. ఏఎస్‌ఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.